క్లుప్తంగా

కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన



కానిస్టేబుల్ శేఖర్‌గౌడ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కనగల్ : మండలంలోని చినమాదారంలో జంట హత్యలు, పర్వతగిరిలో జరిగిన మర్డర్ కేసులో ఛేదించినందుకు గాను కనగల్ ఎస్‌ఐ పి.విష్ణుమూర్తి, కానిస్టేబుళ్లు పోగుల శేఖర్‌గౌడ్, వై.నాగేష్‌ను మంగళవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తన కార్యాలయంలో అభినందించారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా జాతీయ వాలీబాల్ క్రీడలకు ఎంపికైన కానిస్టేబుల్ నిమ్మ బేబిశాలినిని ఎస్పీ అభినందించారు.

బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ క్రాంతికుమార్

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ఎస్‌ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు పోలీస్‌స్టేషన్‌లో బహుమతులు అందజేసి మాట్లాడారు, కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, క్రీడా నిర్వాహకుడు గణేష్, తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి చేస్తాం



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ టూటౌన్ : మహాశివరాత్రి సందర్భంగా పానగల్‌లోని దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్ అన్నారు. మంగళవారం పానగల్‌లోని ఛాయా సోమేశ్వర ఆలయ ఆవరణ, పరిసర ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జి.శ్రీనివాస్, సీహెచ్.నాగరాజు, ఏఈలు దిలీప్, కాంట్రాక్టర్ కవి, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకున్న ఎమ్మెల్యే



చిట్యాలలో ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల ఆధార్‌సెంటర్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం తన ఆధార్‌కార్డును అప్‌డేట్ చేయించుకున్నారు. ఆయన నకిరేకల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ చిట్యాలలో ఆగి ఆధార్ అప్‌డేట్ చేయించుకన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణనాయక్, ఆర్‌ఐ జానీషరీఫ్, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఆపరేటర్ బెల్లి సత్తయ్య ఉన్నారు.

లింగయ్య సేవలు మరువలేనివి



లింగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నంద్యాల నర్సింహారెడ్డి

కనగల్ : మండలంలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జినుకుంట్ల లింగయ్య సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర నాయకుడు నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు లింగయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరీంపాషా, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, ఆర్‌టీఏ సభ్యుడు రాజిరెడ్డి, సత్తయ్య, పద్మ, సరోజ ఉన్నారు.

మృతుడి నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్ : దర్వేశిపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లింగయ్య సోమవారం రాత్రి మృతి చెందాడు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టు ఐడోనేషన్ సెంటర్ ఎండీ డాక్టర్ హరనాథ్ కుటుంబ సభ్యుల అనుమతితో మంగళవారం లింగయ్య కార్నియాను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు హరనాథ్, పుల్లారావు, చంద్రశేఖర్ మృతుడి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తయిన ప్రభుత్వ భవనాలు

- రూ.1.36కోట్లతో పీఏసీఎస్, ఏఎంసీ కార్యాలయాల నిర్మాణం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ప్రారంభోత్సవాలు
- ప్రారంభిస్తే రైతులకు మరింతగా అందనున్న సేవలు



శాలిగౌరారంలో నిర్మితమైన పీఏసీఎస్ కార్యాలయ, గోడౌన్‌ల నిర్మాణం



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్మితమైన కార్యాలయ భవనం

శాలిగౌరారం : రైతులకు మరింతగా సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ నూతన కార్యాలయ భవనం, పీఏసీఎస్ కార్యాలయం, స్టోరేజి, గోడౌన్ల భవన నిర్మాణాలు చేపట్టింది. ప్రస్తుతం ఆ భవన నిర్మాణాలు పూర్తయ్యి ప్రారంభోత్సవాలకు సిద్ధమయ్యాయి.

రూ.1.36కోట్లతో నూతన భవనాలు ..

మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో నాబార్డు నిధుల నుంచి రూ.90లక్షలతో నూతన కార్యాలయాన్ని, అదే విధంగా స్టోరేజి భవనం, 500మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ నిర్మాణం చేపట్టారు. అందులో రూ.38.36లక్షలతో 500మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ నిర్మాణం, రూ.50.89లక్షలతో కార్యాలయం, స్టోరేజి భవనాలను నిర్మించారు. అదేవిధంగా శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ నిధుల నుంచి రూ.46లక్షలతో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం భవనం నిర్మించారు. ఈ భవనం నిర్మాణ పనులు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభం కాగా 2024డిసెంబర్‌లో పూర్తయ్యాయి.

తీరనున్న రైతుల ఇబ్బందులు..

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో కార్యాలయ భవనం లేకపోవడంతో రైతుల విశ్రాంతి భవనంలోనే కొన్నేళ్లుగా కార్యాలయం ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ధాన్యం అమ్మకాలు జరిపే సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు గదులు లేకపోవడంతో మార్కెట్‌యార్డు ఆవరణలోని చెట్లకిందనే సేదతీరుతున్నారు. నూతన కార్యాలయ భవనం ప్రారంభమై వినియోగంలోకి వస్తే అటు మార్కెట్ సిబ్బందికి, ఇటు రైతులకు ఎంతో మేలు జరగనుంది. అదేవిధంగా మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ భవనం వినియోగంలోకి వస్తే ఎరువులు, విత్తనాలతో పాటు సహకార సంఘం సేవలు రైతులకు మరింత అందుబాటులోకి రానుండడంతో అటు రైతులకు ఇటు సహకార సంఘానికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. మండల కేంద్రంలో ఆయా భవనాల ప్రారంభోత్సవాలు జరిగి వినియోగంలోకి వస్తే ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్న రైతులకు, అధికారులు, సిబ్బంది ఇబ్బందులు తొలగనున్నాయి.

ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రారంభోత్సవాలు..

మండల కేంద్రంలో రూ.1.36కోట్లతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, పీఏసీఎస్ కార్యాలయం, గోడౌన్ భవనాలు పూర్తైనప్పటికీ పాలకుల ఉదాసీన వైఖరితో ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రారంభోత్సవాలు నిలిచిపోయాయి. ఈ లోగా స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వస్తే ఇక అంతే సంగతులు.

చిన్న పనులే మిగిలాయి



మండల కేంద్రంలో రూ.90లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న పీఏసీఎస్ కార్యాలయం, స్టోరేజి, గోడౌన్ నిర్మాణాల్లో చిన్న చిన్న పనులు మిగిలిపోయాయి. మిగిలిన పనులను వారం రోజుల్లో పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేస్తాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే భవనాలను ప్రారంభించి రైతులకు వినియోగంలోకి తీసుకువచ్చి సహకార సంఘం విస్తృత సేవలను అందిస్తాం.

– తాళ్లూరి మురళి, పీఏసీఎస్ చైర్మన్, శాలిగౌరారం

కోడ్ ముగియగానే ప్రారంభం



వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.46 లక్షలతో నూతనంగా నిర్మించిన మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రారంభం నిలిచిపోయింది. కోడ్ ముగిసిన వెంటనే కార్యాలయ భవనాన్ని ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– చీనానాయక్, మార్కెట్ కార్యదర్శి, శాలిగౌరారం

మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్న కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : ఇచ్చిన ఆరు గ్యారంటీలను పట్టించుకోకుండా ప్రజాపాలన పేరుతో కాలయాపన చేస్తూ గత 14నెలలుగా ప్రజలను కాంగ్రెస్ పార్టీ మభ్యపెడుతుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. మంగళవారం మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలను అందజేస్తామని దరఖాస్తులు తీసుకుని కాలం వెళ్లదీయడం మానేసి అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు సర్వేలతో కుల గణన చేసిందన్నారు. సర్వేలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో గుండ్రాంపల్లి గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బత్తుల నర్సింహ, మాజీ సర్పంచ్‌లు కొలను సతీష్‌గౌడ్, మర్రి జలంధర్‌రెడ్డి, నాయకులు కొలను వెంకటేష్‌గౌడ్, దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బీమిడి చినవెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న క్లస్టర్ ఏపీడీ లక్ష్మీనర్సింహారావు

కేతపల్లి : ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఈజీఎస్ క్లస్టర్ ఏపీడీ లక్ష్మీనర్సింహారావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఇనుపాముల, కొర్లపహాడ్, బండపాలెం, చీకటిగూడెం, చెర్కుపల్లి గ్రామాలలో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పనులను, వన నర్సరీలను, ఇంకుడు గుంతల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. పనిప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాలలో వ్యవసాయ పనులు లేనందున పనికోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి జాబ్‌కార్డు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. ఫిబ్రవరిలో ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 50మంది కూలీలు ఉపాధిహామీ పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత నుండి మొక్కల సంరక్షణకు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయటంతో పాటు ప్రతి రోజు రెండు సార్లు మొక్కలకు నీరందించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ సురేందర్, ఈసీ లక్ష్మి, టీఏలు సైఫుద్దీన్, కృష్ణప్రసాద్, సైదులు తదితరులు ఉన్నారు.

డివిజన్ మార్పుపై రైల్వే కార్మికుల హర్షం



కేక్ కట్ చేస్తున్న రైల్వే కార్మికులు, నాయకులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లాలోని పగిడపల్లి నుంచి విష్ణుపురం వరకు ఉన్న ప్రాంతాన్ని గుంటూరు డివిజన్ నుంచి ఇటీవల కేంద్రం ప్రభుత్వం సికింద్రాబాద్ డివిజన్‌లో విలీనం చేయడం పట్ల రైల్వే కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. కేంద్రం ప్రకటన గుంటూరుకు వెళ్లాల్సిన వెయ్యి మంది రైల్వే ఉద్యోగులకు ఊరట కలిగించిందన్నారు. గతంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో డివిజన్ మార్పు జరిగిందని, వారికి ఉద్యోగులు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి పాశం నరేష్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయి సంఘ్ నడికుడి బ్రాంచ్ చైర్మన్ వెలిజల రమేష్, రైల్వే ఇనిస్టిట్యూట్ ట్రెజరర్ పి.మల్సూర్, జోనల్ యూత్ మెంబర్ జానపాటి వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకన్న, సీహెచ్ శ్రీనివాస్, రామాచారి, రవి, అంజయ్య, శ్రీశైలం, రాంబాబు, సుధాకర్, వినోద్ పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం



నల్లగొండ టూటౌన్ : దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ టూటౌన్ : పండిట్ దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరేల్లి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు నూకల వెంకట్‌నారాయణరెడ్డి, షేక్ బాబా, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాలకూరి రవిగౌడ్, చింత ముత్యాలరావు, రమణ, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



చండూరు : బీజేపీ ఆధ్వర్యంలో..

చండూరు : పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీ బలిదాన్ దివస్‌ను మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు పందుల సత్యం, ముదిగొండ అంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోమటి వీరేశం, నకిరేకంటి లింగస్వామి, భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి, సోమ శంకర్, బోడ అంజనేయులు, వెంకటేశం, రవీందర్, స్వామి, నాగారాజు, శివ, పవన్, సాగర్, రాజు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడుతా

నల్లగొండ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడుతానని వరంగల్ – ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజు యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా 317జీఓను గత ప్రభుత్వం తీసుకొస్తే దానిపై మండలిలో ఉన్న ఎమ్మెల్సీ ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏ పాలసీ తీసుకొచ్చినా అది ఉపయోగకరంగా ఉండాలి కాని 310 జీఓతో ఎంతో మంది ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఒక ఉద్యమకారుడిగా నాకు ఒక అవకాశం ఇవ్వండి సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతానన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకుడు చీర పంకజ్‌యాదవ్, దుడుకు లక్ష్మీనారాయణ, ప్రసన్నకుమార్, గుండు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

విద్యారంగం సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

నకిరేకల్ : ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం కృషిచేస్తానని, తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనమండలిలో ప్రశ్నించే గొంతు నినదించాలన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం కోసం తాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. సమావేశంలో జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పులి పాపయ్య, నాయకులు డాక్టర్ తోట నరసింహచారి, నరేష పవన్, మోకరామన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ

నార్కట్‌పల్లి : ఉపాధ్యాయులు విషయ పరిజ్ఞానం పెంచుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలని డీఈఓ భిక్షపతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అక్కెనపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులు 10/10 సాధించేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, మాదనయ్య, సతీష్‌కుమార్, శ్రీజ్ఞానేశ్వరచారి, సుజాత, తదితరులున్నారు.

రేషన్‌కార్డులపై స్పష్టత ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : కొత్త రేషన్‌కార్డుల ఆన్‌లైన్ దరఖాస్తులపై పౌరసరఫరాల శాఖ స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్యలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, కోట్ల అశోక్‌రెడ్డి, గాదే నరసింహ, భూతం అరుణ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్యపరీక్షలు

నకిరేకల్ : మండలంలోని తాటికల్‌లో గల లయన్స్ వృద్ధాశ్రమంలో ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ అధ్యక్షుడు ఎస్.రాంమోహన్‌రావు, డాక్టర్ వైష్ణవి, ఈశ్వరి, వైద్యసిబ్బంది అనిత, ఎల్లయ్య, రూపా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



మునుగోడు : అంగన్‌వాడీ కేంద్రంలోని అన్నాన్ని పరిశీలిస్తున్న డీడబ్ల్యూఓ కృష్ణవేణి

మునుగోడు : మండలంలోని మునుగోడు, వెల్మకన్నె, గట్టుప్పల్ గ్రామాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం డీడబ్ల్యూఓ కృష్ణవేణి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలకు సరఫరా అయ్యే పోషకాహార పదార్థాలను, గుడ్లను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పిల్లలందరూ కేంద్రాలకు వచ్చేలా చూడాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలలో పరిశుభ్రతను పాటించాలన్నారు. ఆమె వెంట ఏసీడీపీఏ వెంకటమ్మ, సూపర్‌వైజర్‌లు శివేష, యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు ఉన్నారు.

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నె, గట్టుప్పల్ గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను డీడబ్ల్యూఓ కృష్ణవేణి మంగళవారం తనిఖీ నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ శివేశా తదితరులు ఉన్నారు.

ధాన్యం వివరాలు రికార్డుల్లో పొందుపరచాలి



మర్రిగూడ : మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

మర్రిగూడ : రైస్‌మిల్లుల్లో ధాన్యం వివరాలను తప్పకుండా రికార్డుల్లో పొందుపరచాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం శివారులోని ఓ రైస్‌మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి మిల్లులో ధాన్యం వివరాలను, రైతుల వివరాలను తప్పకుండా నమోదు చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

డొమెస్టిక్ సిలిండర్లు హోటళ్లకు తరలిస్తే చర్యలు

నాంపల్లి : డొమెస్టిక్ సిలిండర్లు హోటళ్లకు తరలిస్తే చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఆయన తనిఖీలు చేపట్టి మాట్లాడారు. అనంతరం చిట్టంపహాడ్‌లో చౌకధరల దుకాణాలంలో బోర్డు లేకుంటే అగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ దుకాణంలో రెట్ల పట్టిక, తూకంలో తేడాలు వస్తే డీలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ స్థానాల ఓటరు జాబితా విడుదల

నకిరేకల్ : మండలంలోని తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు 17గ్రామపంచాయతీల వారీగా ఓటరు జాబితాను అధికారులు మంగళవారం విడుదల చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 26,858ఉన్నారు. వారిలో పురుషులు 13,280, మహిళలు 13,576, ఇతరులు ఇద్దరు ఉన్నారు. మండల వ్యాప్తంగా తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కడపర్తిలో 2335, ఓగోడులో 1919, నడిగూడెంలో 479, పాలెంలో 1528, వల్లాభాపురంలో 1184, నోములలో 4046, చందంపల్లిలో 1037, నెల్లిబండలో 630, గొల్లగూడెంలో 599, తాటికల్‌లో 2605, మంగళపల్లిలో 2177, నర్సింహాపురంలో 432, గోరెంకలపల్లిలో 1514, మర్రూర్‌లో 1663, మోదినిగూడెంలో 562, చందుపట్లలో 3098, మండలాపురంలో 1020 మంది చొప్పున ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రదర్శన

కేతేపల్లి : మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం 54 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల జాబితాను ప్రదర్శించారు. మండలంలో 16గ్రామపంచాయతీల పరిధిలో 11ఎంపీటీసీ స్థానాలకు గాను 31,261 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామాల వారీగా గుడివాడలో 5 పోలింగ్ బూత్‌లు, కాసనగోడులో–3, బొప్పారం–2, కొత్తపేట–3, ఉప్పలపహాడ్–2, కొర్లపహాడ్–3, ఇప్పలగూడెం–2, బండపాలెం–2, ఇనుపాముల–7, కేతేపల్లి(1)–6, చీకటిగూడెం–2, కొండకిందిగూడెం–2, చెర్కుపల్లి–4, తుంగతుర్తి–4, కొప్పోలు–4, భీమారంలో 5 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహోత్సవాలు



కల్యాణంలో పాల్గొన్న మాజీ సర్పంచ్‌లు

కనగల్ : మండల పరిధిలోని పగిడిమర్రిలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం విఘ్నేశ్వర పూజలు నిర్వహించి శ్రీ జమదగ్ని రేణుకాఎల్లమ్మ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించారు. నేడు సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, ఇదుకుళ్ల రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

నాంపల్లి : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి కల్యాణాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నూతన పట్టువస్త్రాలను నక్క భువనేశ్వర్ సమర్పించారు. అనంతరం పూజారి రఘువశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొట నర్సింహ, కుంభం కృష్ణారెడ్డి, ఉమానాగలింగేశ్వర ఆలయ చైర్మన్ పెద్దిరెడ్డి అనంతరెడ్డి, వైస్ చైర్మన్ విరమాళ్ల నాగరాజు, స్వామి ఆలయ చైర్మన్ కోట రఘునందన్, పున్న కోటేశ్వర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

సంక్షిప్త సమాచారం

ఎంజీయూలో హడలెత్తించిన పాము

నల్లగొండ టూటౌన్ : ఎంజీ యూనివర్సిటీలోని లైబ్రరీలో పుస్తకాల మధ్య పాము చేరి మంగళవారం విద్యార్థులను హడలెత్తించింది. విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు తీసుకుంటుండగా వాటి మధ్యలో పాము కనిపించడంతో భయంతో బయటకు పరుగులు తీశారు. దీంతో యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది వచ్చి పామును చంపడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రపంచ శాంతిని కాపాడాలి

రామగిరి(నల్లగొండ) : ప్రస్తుతమున్న సంక్షోభంలో ప్రపంచశాంతిని కాపాడాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు కె.ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగార్జున ప్రభుత్వ కళాశాల, చరిత్ర విభాగంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి అంగాలు, విజయాలు, ప్రపంచ శాంతిని కాపాడడంలో ఐక్యరాజ్య సమితి పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హిస్టరీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ భట్టు కిరీటం, ఉపన్యాసకులు యస్.కోటయ్య, డాక్టర్ ఆదే మల్లేశం, అధ్యాపకులు చంద్రయ్య, హబీబ్, డాక్టర్ అంకూస్, జె.దినేష్, ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్‌లో జరిగిన ఇండియా ఫస్ట్ స్కిల్ ఒలింపియాడ్ రాష్ట్ర స్థాయి లెవెల్ –2 పోటీ పరీక్షలో నల్లగొండలోని సాందీప్ హైస్కూల్‌కు చెందిన 7గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రూ.25వేలు గెలుచుకున్నారు. మంగళవారం విద్యార్థులను పాఠశాల వ్యవహర్త గానుతుల సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ భూమిలో మట్టిని తరలించొద్దు

కట్టంగూర్ : ప్రభుత్వ భూమిలో మట్టిని తరలించొద్దని మండలంలోని బొల్లేపల్లి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 318లో 3.36ఎకరాలు గల ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు జరిపేందుకు ఈ నెల 3న మైనింగ్ ఏడీఈకి కాంట్రాక్టర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, మట్టి తవ్వకాలకు సంబంధించిన దరఖాస్తును తిరస్కరించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని గ్రామస్తులు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వై.ఉపేందర్, వి.సంజీవరెడ్డి, జానకిరాములు, కుమార్ తదితరులు ఉన్నారు.

కబ్రస్థాన్ భూముల పరిశీలన

మునుగోడు : మండల కేంద్రంలోని కబ్రస్థాన్ సమీపంలోని భూములను వక్ఫ్‌బోర్డు అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, ముస్లిం పెద్దల ద్వారా భూముల వివరాలను తెలుసుకున్నారు. పరిశీలించిన వారిలో వక్ఫ్‌బోర్డు జిల్లా వర్క్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అలీ, వక్ఫ్‌బోర్డు సీఈఓ కార్యాలయ ఏఈ అసదుల్లా ఉన్నారు.

అర్చకుడు రంగరాజన్‌పై దాడి సరికాదు

కనగల్ : చిలుకూరు దేవస్థాన ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం సరికాదని తెలంగాణ రాష్ట్ర అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యుడు, దర్వేశిపురం శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవస్థాన ప్రధాన అర్చకుడు చిలకమర్రి శ్రవణ్‌కుమారాచార్యులు అన్నారు. మంగళవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగరాజన్‌పై జరిగిన దాడి గురించి తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి స్పందన అభినందనీయమన్నారు. ఇలాంటి దాడులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి కల్యాణం

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి పరిధిలో గల శ్రీసురమాంబ కంఠమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణాన్ని కమిటీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవం

రామగిరి (నల్లగొండ) : నల్లగొండలోని హనుమాన్ నగర్‌లో గల అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పారాయణ, గోపూజ, యాగశాల, స్వామి వారికి అభిషేకం, సామూహిక హనుమాన్ చాలిసా పారాయణ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిట్యాల : పట్టణానికి చెందిన ఉప్పలపల్లి సైదులు ఇటీవల మృతి చెందారు. అతడితో పాటు స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 2003–04లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆర్థికసాయం అందించేందుకు సంకల్పించారు. వారంతా కలిసి రూ.40వేలు సేకరించి మంగళవారం బాధిత కుటుంబానికి అందించారు.